


సంగమేశ్వరా.. అందుకో పూజలు!

కృష్ణాజలాల నుంచి ప్రాచీన సంగమేశ్వర ఆలయం బయల్పడింది. దీంతో భక్తులు స్వచ్ఛందంగా వచ్చి ఆలయంలో బురద తొలగింపు పనులు చేపట్టారు. 8లో▸



హుండీ ఆదాయం రూ.3.4 కోట్లు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలోని హుండీల కానుకలను లెక్కించారు. మొత్తం 30 రోజులకు రూ. 3,48,69,621 ఆదాయం వచ్చినట్లు శుక్రవారం శ్రీమఠం అధికారులు తెలిపారు.



ఆధిపత్యం కోసమే హత్య

టీడీపీ నాయకుడు షరీన్‌నగర్‌కు చెందిన కాశపోగు సంజన్న హత్య కేసు మిస్టరీ వీడింది. ఆధిపత్యం కోసమే హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చారు. 8లో▸

సాక్షి నంద్యాల

శనివారం । 22 । మార్చి । 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:58
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 4:57
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:59
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:53
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:56

హదీస్ వెలుగు:

అల్లాహ్ మీరు చేసే పనులు గమనించడం లేదని అనుకోవద్దు. అమావాస్య చీకటిలో నల్లటి రాతికొండ కింద ఉన్న నల్ల చీమనూ చూస్తుంటారు. – పవిత్ర ఖురాన్

కాకి లెక్కలు.. ఆకలి కేకలు

- 'ఉపాధి' పనుల్లో టీడీపీ, జనసేన నేతల ఇష్టారాజ్యం
- జనవరి 13 నుంచి కూలీలకు అందని వేతనాలు
- పూర్తి కాని పశువుల షెడ్లు.. అయినా అబద్ధపు ప్రచారం
- ఆన్‌లైన్‌లోనే పండ్లతోటలు.. క్షేత్రస్థాయిలో కనిపించని వైనం
- నేడు ఓర్వకల్లు మండలంలో ఫాంపాండ్స్ పనులను ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అసలే కరువు జిల్లా.. అరకొర పనులు కూడా అందని దుస్థితి.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూడా అందనంత దూరంలో ఉంటోంది. అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీ నేతలు 'ఉపాధి' పనుల్లో రాజకీయాలు చేస్తున్నారు. అక్రమాలు వెలుగులోకి వస్తున్నా చర్యలు నామమాత్రమే. కూలీలకు, చిన్న రైతులకు వలసలే దిక్కవుతున్నాయి. 'ఉపాధి' పథకం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిధిలో ఉన్నా.. అవినీతి కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నేడు ఓర్వకల్లు మండలం పూడిచెర్ల వద్ద ఫాంపాండ్స్ పనులను డిప్యూటీ సీఎం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..





తుగ్గలి మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలు, సన్న, చిన్నకారు రైతులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే పనులు కల్పించడం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రధాన లక్ష్యం. అయితే ఈ పథకం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల చేతుల్లో బందీ అయ్యింది. గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రమశక్తి సంఘాలకు మేట్లుగా టీడీపీ, జనసేన కార్యకర్తలే నియమితులు అయ్యారు. జిల్లాలో 3.50 లక్షల జాబ్ కార్డులు ఉండగా.. ఇందులో 2.61 లక్షలు ఉపయోగంలో ఉన్నాయి. రోజుకు లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలనేది లక్ష్యం కాగా.. 56 వేల మంది కూలీలు మాత్రమే హాజరవుతున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. చాలా చోట్ల 25 నుంచి 30 శాతం వరకు బోగస్ మస్టర్లు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామంలో రోజుకు 200 మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. అయితే 300 మందికి పైగా మస్టరు వేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

'వెయ్యి' అబద్ధాలు

'ఉపాధి' నిధులతో పండ్లతోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. 2023–24లో 11,202 ఎకరాల్లో పండ్ల తోటలు ఉండగా.. 2024–25లో ఉపాధి నిధులతో 4,150 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసినట్లు లెక్కలు చూపుతున్నాయి. ఉద్యాన శాఖ కూడా 1,000 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేసినట్లు చెబుతోంది. ఈ ప్రకారం 2024–25లో పండ్ల తోటలు సాగు భారీగా పెరగాలి. అయితే ఈ క్రాప్‌లో 2024–25లో 11,650 ఎకరాల్లో పండ్ల తోటల సాగు ఉన్నట్లు స్పష్టమవుతోంది. కేవలం 448 ఎకరాల్లోనే పండ్లతోటల సాగు పెరిగినట్లు తెలుస్తోంది. 'ఉపాధి' నిధులతో చేపడుతున్న పండ్ల తోటల సాగు ఆన్‌లైన్‌లో మాత్రమే కనిపిస్తోంది తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

ఇవీ అక్రమాలు..

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉనికిలో లేకుండా పోయిన శ్రమశక్తి సంఘాలు ఊపిరి పోసుకున్నాయి. మేట్ల వ్యవస్థ మళ్లీ వచ్చింది.
- తుగ్గలి, మద్దికెర, ఆలూరు, ఆస్పరి, పెద్దకడుబూరు, కౌతాళం, దేవనకొండ, కృష్ణగిరి కల్లూరు, ఓర్వకల్లు, కోడుమూరు, హాలహర్వి, కోసిగి తదితర మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. టీడీపీ, జనసేన పార్టీ నేతలకు అనుకూలంగా ఉండేవారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించారు.
- వైఎస్సార్‌సీపీ పాలనలో నియమితులైన వారిని అడ్డు తొలగించుకునేందుకు హత్యలకు పాల్పడుతున్నారు. ఆస్పరి మండలంలో ఒక ఫీల్డ్ అసిస్టెంటును దారుణంగా హత్య చేశారు.
- ప్రతి ఆర్థిక సంవత్సరం మూడు, నాలుగు నెలల ముందుగానే కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కేటాయించాలి. కూలీలకు అదనంగా పనులు కల్పించాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. దొంగ మస్టర్లు వేసుకోవడం, రాత్రికి రాత్రే యంత్రాలతో పనులు చేయించడం వంటి అక్రమాలు జోరుగా సాగుతున్నాయి.
- వెల్దుర్తి, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, ఆస్పరి తదితర మండలాల్లో యంత్రాలతో ఉపాధి పనులు చేయిస్తున్నారు. వెల్దుర్తి మండలంలోని ఓ గ్రామంలో యంత్రాలతో పనులు చేయిస్తుండగా ప్రజలు అడ్డుకున్నారు.

ఫాంపాండ్స్ పేరుతో హడావుడి

2014 నుంచి 2018 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఫాంపాండ్స్ అంటూ హడావుడి చేసింది. వీటికి పంటల సంజీవినిగా పేరు పెట్టింది. కూటమి ప్రభుత్వం కూడా ఫాంపాండ్‌లను మళ్లీ తెరపైకి తెచ్చింది. ఫాంపాండ్ పనులు ప్రారంభించేందుకు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ శనివారం జిల్లాకు వస్తున్నారు. ఓర్వకల్లు మండలంలో ఫాంపాండ్ తవ్వకాలను ప్రారంభిస్తారు. జిల్లాలో 8,500 ఫాంపాండ్స్ తవ్వాలని నిర్ణయించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూడా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఉంది. అయితే అక్రమాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ హయాంలో 2014 నుంచి 2018 వరకు ఒక పనికి రెండు మండలాల్లో బిల్లులు చేసుకొని నిధులను కాజేశారు. పాత చెక్‌డ్యామ్‌లకు మెరుగులు దిద్ది డోన్, తగ్గలి మండలాల్లో బిల్లులు చేశారు. పలు మండలాల్లో పాతపనులకే మెరుగులు దిద్ది నిధులు మింగేశారు. మళ్లీ అలాంటి పరిస్థితులే వస్తాయనే విమర్శలు ఉన్నాయి.

టీడీపీ పా'పాలు'

'ఉపాధి' నిధులతో ఒకవైపు సీసీ రోడ్లు, మరోవైపు పశువుల షెడ్లు నిర్మిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1,200 పశువుల షెడ్లు నిర్మించాలనేది లక్ష్యం కాగా.. 975 వరకు మంజూరు చేశారు. టీడీపీ, జనసేన కార్యకర్తలకే మంజూరు అయ్యాయి. మొత్తం 961 పశువుల షెడ్ల పనులు మొదలు కాగా.. 664 పూర్తయ్యాయి. పశువుల షెడ్ల నిర్మాణంతో పాల ఉత్పత్తి పెరిగినట్లు జిల్లా యంత్రాంగం లెక్కలు చెబుతోంది. షెడ్ల నిర్మాణంతో ప్రతి రైతుకు నెలకు రూ.12,000 వరకు అదనపు ఆదాయం సమకూరుతోందని అధికారులు చెబుతుండటంపై విస్మయం వ్యక్తం అవుతోంది. షెడ్లు అరకొరగా పూర్తికాగా.. పశువులు వెళ్లిన దాఖలాలు లేవు. అయినా రోజుకు ఒక్కో పశువు అదనంగా రెండు లీటర్ల పాలు ఇస్తుందని లెక్కలు వేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వేతనాలు అందక కూలీల వేదన

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు హాజరైతే కూలీకి రోజుకు రూ.300 వేతనం లభిస్తుంది. అయితే ఆలూరు, మంత్రాలయం నియోజక వర్గాల్లో వందలాది మందికి కేవలం రూ.60 నుంచి రూ.70 వరకు మాత్రమే పడుతుండటం ఆందోళన కలిగించే విషయం. ఇదిలా ఉండగా జనవరి రెండో వారం నుంచి ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు ఒక్క రూపాయి వేతనం కూడా చెల్లించిన దాఖలాలు లేవు. ఒక్క కర్నూలు జిల్లాలో ఉపాధి కూలీలకు దాదాపు రూ.43 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. మెటీరియల్ కాంపోనెంటు కింద మరో మరో రూ.60 కోట్ల బకాయిలు పేరుకపోయాయి. నెలల తరబడి వేతనాలు లేకపోవడంతో బతుకు భారమవుతున్న వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు వలస బాట పడుతున్నారు.

ఉపాధి పనులు ఇలా..

ఆర్థిక సంవత్సరం	పనిదినాల సంఖ్య
2023-24	కోటి
2024-25	84.82 లక్షలు

ఉపాధి పనులు అందక జిల్లాలో ఇప్పటి వరకు 1.5 లక్షల మంది కూలీలు వలస వెళ్లినట్లు తెలుస్తోంది.

ఇలాగైతే ఎలా బతకాలి?



మా గ్రామంలో 80 శాతం మందికి ఉపాధి పనులే ఆధారం. జనవరి, ఫిబ్రవరి నెలల్లో మూడు వారాలు పనులకు వెళ్లాం. ఇంతవరకు డబ్బులు పడలేదు. మార్చి నెలలో ఒక్క రోజు కూడా ఉపాధి పని పెట్టలేదు. అధికారులు మాత్రం అన్ని గ్రామాల్లో పెట్టినట్లుగా చెబుతున్నారు. ఇలాగైతే ఎలా బతకాలి? పొట్టపట్టుకుని వలస వెళ్లాల్సిందే.
– నజీర్‌సాహెబ్, మామిళ్లకుంట, తుగ్గలి మండలం

చర్యలు తీసుకుంటున్నాం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందాలు ఆడిట్ చేస్తున్నాయి. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులను వెంటనే సస్పెండ్ చేస్తున్నాం. ఉపాధి పనులపై వచ్చే ఫిర్యాదులపై కూడా ఎప్పటికప్పుడు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదలవుతాయి. రానున్న రోజుల్లో ఫాంపాండ్స్‌ను ఉద్యమ తరహాలో నిర్మించనున్నాం.
– వెంకట రమణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

న్యూస్‌రీల్

మహిళలు, చిన్నారులపై నేరాలు అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లా అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణకు పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఆధునిక సాంకేతికను ఉపయోగించి మిస్సింగ్ కేసులు, తీవ్రమైన నేరాలకు పాల్పడిన నిందితులను గుర్తించాలన్నారు. అనుమానాస్పద మృతి కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి కేసును ఛేదించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్, పోక్సో కేసుల్లో నిందితులపై రౌడీషీట్‌లు తెరవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఎస్పీలు జావలి ఆల్ఫోన్స్, ప్రమోద్, రామాంజినాయక్, రాజసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

ప్యాపిలి: ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ బొజ్జన్నపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట రామిరెడ్డి తెలిపారు. విద్యార్థినుల పట్ల బొజ్జన్న అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో గురువారం విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలలో ఆందోళన చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి



రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తపల్లి: నూతన సాంకేతిక పద్ధతులతో దళిత రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ హెడ్ జి.ధనలక్ష్మీ అన్నారు. శుక్రవారం కొక్కెరంచ గ్రామంలో సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి, ఏఓ కె.మహేష్‌లతో కలసి కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె వారి ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ పరిశోధన యాజమాన్య సంస్థ(నార్మ్) హైదరాబాద్ వారు దళిత రైతులకు టార్పాలిన్, వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉపప్రణాళిక పథకంలో భాగంగా టార్పాలిన్, సూక్ష్మపోషకాలు రైతుల వారీగా రెండు వందల మందికి, రోటవేటర్, తొమ్మిది చెక్కల గొర్రు, శ్రెడ్డర్, డైవాన్ స్ప్రేయర్ పంపులు, పారలు, ఇతర వ్యవసాయ పరికరాలను గ్రూపుల వారీగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జాతీయ వ్యవసాయ పరిశోధ యాజమాన్య సంస్థ (నార్మ్) శాస్త్రవేత్తలు బాలకృష్ణన్, నిర్మల, సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సరేష్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఉగాది మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఉగాది మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. కైలాస ద్వారం, హఠకేశ్వరం, సాక్షి గణపతి వద్ద చేపట్టిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పాదయాత్రగా వచ్చే భక్తులు కైలాసద్వారం వద్ద సేద తీరేందుకు వీలుగా విశాలమైన తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. అక్కడి నుంచి భీమునికొలను వరకు తాత్కాలిక పైప్ లైన్ ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ మార్గంలో ఆరు చోట్ల 1000 లీటర్ల సామర్థ్యం ఉన్న ఆరు సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేశామన్నారు. కైలాసద్వారం వద్ద తగినంత పారిశుద్ధ్య సిబ్బందిని నియమించి చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని దేవస్థానం పారిశుద్ధ్య విభాగం అధికారులను ఆదేశించారు. కాలిబాటలో ఏర్పాట్ల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి, పారిశుద్ధ్య విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు పీవీ సుబ్బారెడ్డి, సంబంధిత సహాయ ఇంజినీర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



కైలాస ద్వారం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు పెద్ద ఎత్తున ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. ఈనెల 25, 26 తేదీల్లో ముఖ్యమంత్రి నిర్వహించే కలెక్టర్ల సదస్సులో వివరించాల్సిన అంశాలపై శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు కేసీ కెనాల్, కుందూ నది, ఎస్సార్‌బీసీ కాల్వలపై ఆధారపడి ఉన్న 13 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపాలన్నారు. జిల్లాలో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వాలన్నారు. వేసవిలో వడదెబ్బ, అతిసార వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సంబంధిత వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చికిత్సకు అవసరమయ్యే మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీలలోని ముఖ్య కూడలి ప్రదేశాలలో చలివేంద్రాలు, ట్రాఫిక్ సిగ్నల్‌లలో చలువ పందిళ్ల ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ట్యాప్‌తో కూడిన మంచినీటి కుండలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలోని దాదాపు 558 ఆర్వో ప్లాంట్లలో ప్రతి నెల నీటి నాణ్యత ప్రమాణాలు పరీక్షించాలని మున్సిపల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఫుడ్ సేఫ్టీ అధికారులకు సూచించారు. వేసవిలో పశుసంపదకు గ్రాసం కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు నీటి కొరత లేకుండా కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చిన్నారుల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యం

గోస్పాడు: చిన్నారుల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారుల రవాణా సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాన్ని శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార చికిత్స క్యాంపుల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తారన్నారు. పుట్టుకతో వచ్చే నాలుగు రకాల వ్యాధులను గుర్తించి నంద్యాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న డైస్ కేంద్రం, స్థానిక ఆసుపత్రులకు వైద్యులు రెఫర్ చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తారన్నారు. అనంతరం ప్రపంచ డౌస్ సిండ్రోమ్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, చిన్న పిల్లల వైద్య నిపుణులు అరుణజ్యోతి మాట్లాడుతూ.. జన్యు లోపంతో ఆటిజం, మెంటల్ రిటార్డేషన్, హృదయ సంబంధ, మాట్లాడలేకపోవడం, నరాల సంబంధిత అవయవలోపాలు వంటి సమస్యలతో జన్మిస్తారన్నారు. ఈ పిల్లలకు సరైన సమయంలో సకాలంలో చికిత్స అందిస్తే మెరుగైన ఫలితం ఉంటుందన్నారు.



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్ వెంకటరమణ

గురుకులాల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13కు వాయిదా

కర్నూలు(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం)లో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడినట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాల్ టికెట్లను ఏప్రిల్ 1వ తేదీ నుంచి జారీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి వారికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వారికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం ఆన్‌లైన్‌లో http://apbragcet.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

366 మంది 'పది' విద్యార్థులు గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 366 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 130 పరీక్ష కేంద్రాల్లో 24,777 విద్యార్థులకు గాను 24,411 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 22 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, నాలుగు కేంద్రాలను డీఈఓ జనార్దన్‌రెడ్డి, ఒక పరీక్ష కేంద్రాన్ని స్టేట్ అబ్జర్వర్ అబ్రహం తనిఖీ చేశారు. జిల్లాలోని ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్‌స్క్వాడ్‌ల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేలా చర్యలు చేపట్టామని డీఈఓ తెలిపారు.

'మహా'న్న దానానికి వేళాయె!



నాగలూటి బయలుదేరుతూ ఆత్మకూరులో విశ్రాంతి తీసుకుంటున్న ట్రస్ట్ సభ్యులు

నల్లమల మీదుగా తరలివెళ్తున్న భక్తకోటి ఆకలి తీర్చేందుకు మహారాష్ట్ర దండు కదలివచ్చింది. శ్రీశైలంలో జరిగే ఉగాది ఉత్సవాల నేపథ్యంలో వేలాది మంది కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు నల్లమల మీదుగా పాదయాత్రగా వెళ్తారు. వీరి ఆకలి తీర్చేందుకు నాగలూటి వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో మహారాష్ట్రకు చెందిన కొల్హాపూర్ జిల్లా ఇచ్చలకరంజికిలోని శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్ట్ 19 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం చేపడుతోంది. ఎప్పటిలాగే ఈ యేడు కార్యక్రమం కోసం ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఆత్మకూరు మండలం నాగలూటి క్షేత్రానికి చేరుకున్నారు. నాలుగు భారీ లారీల్లో అన్నదానానికి సంబంధించిన సరుకులతో వచ్చిన వీరు 8 రోజుల పాటు పాదయాత్రికులకు 24 గంటల పాటు అన్నప్రసాదం అందుబాటులో ఉంచుతారు. ట్రస్ట్ సభ్యులు ఎంఎస్‌పాటిల్, పాండుతో పాటు 250 మంది స్వచ్ఛంద సేవకులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. – ఆత్మకూరురూరల్

క్లుప్తంగా

ఏప్రిల్ 10 వరకు ఎల్లెల్సీకి నీరు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు ఏప్రిల్ 10 వరకు సాగునీటిని విడుదల చేసేందుకు కర్ణాటక రాష్ట్ర నీటి సలహా మండలి నిర్ణయం తీసుకున్నట్లు టీబీ బోర్డు అధికారులు శుక్రవారం వెల్లడించారు. బెంగళూరులో జరిగిన సాగు నీటి సలహా మండలి(ఐసీసీ) సమావేశంలో ఆ రాష్ట్ర ప్రజాప్రతినిధులు, నీటి సలహా మండలి సభ్యులు, కర్ణాటక ఇరిగేషన్ అధికారులు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

గోస్పాడు: జిల్లెల్ల – యాళ్లూరు గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం గోవింద పల్లెకు చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగన్న(64) అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బమ్మ, వెంకటమ్మ, చిన్నమ్మ, రమణమ్మ, ఆదిలక్ష్మమ్మ, బోయ పెద్ద సుబ్బమ్మ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

బైక్‌పై వస్తూ..

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణానికి చెందిన చాంద్ బాషా (53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం రాత్రి ఇతను శ్రీపతిరావుపేట నుంచి పట్టణానికి వస్తుండగా పట్టణ శివార్లలోని మదరసా వద్ద ఎన్‌హెచ్ 340సీకి చెందిన అండర్ పాస్ వంతెనను ప్రమాదశాత్తూ ఢీకొట్టి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో చాంద్‌బాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు శుక్రవారం తెలిపారు.

దుఃఖాన్ని దిగమింగి..


కల్లూరు: తండ్రి చనిపోయిన బాధలో కూడా ఓ విద్యార్థి పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన నాగశేషులు, మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు జి. రామ్ చరణ్ ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం విద్యార్థి తండ్రి జి. నాగశేషులు (40) అనారోగ్యంతో మృతి చెందారు. తండ్రి మృతి చెందిన బాధను దిగమింగుకుని ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రంలో శుక్రవారం జరిగిన పరీక్షను రాశారు. తండ్రిని కోల్పోయి రోదిస్తున్న విద్యార్థిని పలువురు ఓదార్చారు.



ఆలయ ఆవరణలో బురదను తొలగిస్తున్న భక్తులు



గర్భాలయంలోని నీటిని ఇంజన్‌తో బయటికి పంపుతున్న దృశ్యం



వేపధారు శివలింగం

సంగమేశ్వరా.. అందుకో పూజలు !

- జలాధివాసం వీడిన సంగమేశ్వరాలయం
- బురద తొలగించి శుభ్రం చేసిన భక్తులు
- నేటి నుంచి సంగమేశ్వరుడి దర్శన భాగ్యం



ముఖమండపంలో బురదను తొలగింపు

సప్తనదుల సంగంలో వెలసిన సంగమేశ్వరుడు దాదాపు ఎనిమిది నెలల అనంతరం మళ్లీ పూజలకు సిద్ధమయ్యాడు. ప్రాచీన సంగమేశ్వరం ఆలయాన్ని గతేడాది జూలైలో కృష్ణా జలాలు ముంచెత్తడంతో అప్పటి నుంచి స్వామి వారు జలాధివాసంలో ఉన్నాడు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగుల నుంచి 837 అడుగులకు చేరుకోవడంతో శుక్రవారం ఆలయం పూర్తి స్థాయిలో బయటపడింది. ఎనిమిది నెలల పాటు కృష్ణా జలాల్లో ఉండడంతో ఆలయ మొత్తం బురదమయమైంది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామ భక్తులు స్వచ్ఛందంగా వచ్చి బురద నీరు తొలగింపు పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణం, ముఖ మండపం, గర్భాలయంలో పూర్తిస్థాయిలో బురద తొలగించి ఆలయాన్ని శుభ్రం చేశారు. గర్భాలయంలోని బురద నీటిని ట్రాక్టర్ ఇంజిన్ సహాయంతో బయటికి పంపించారు. శనివారం నుంచి సంగమేశ్వరుడి దర్శన భాగ్యం భక్తులకు కలుగుతుంది. అనంతరం వేపధారు శివలింగాన్ని పూలమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. మరో నాలుగు నెలల పాటు సంగమేశ్వరుడు భక్తుల చేత పూజలందుకోనున్నారు. – కొత్తపల్లి

మెడికల్ షాపుల్లో 'ఆపరేషన్ గరుడ'



కర్నూలులోని మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు: ఆపరేషన్ గరుడలో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు ఐజీ ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ లోకల్ పోలీస్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెడికల్ షాపులు, ఏజెన్సీల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయేదాకా విస్తృత తనిఖీలు నిర్వహించారు. దుకాణం లైసెన్స్, నిల్వలకు సంబంధించిన రిజిస్టర్లతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయాలు జరుపుతున్న విషయాలపై పరిశీలన జరిపారు. దాదాపు 20కి పైగా దుకాణాల్లో తనిఖీలు చేయగా కొన్నింటిలో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అలాగే భౌతిక నిల్వలకు రికార్డులో పొందుపరచిన నిల్వలకు తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

వెలుగోడు: మోత్కూరు గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోత్కూరు గ్రామానికి చెందిన గుండెపోగు ఏసేపు కుమారుడు అశోక్(28) బైక్‌పై వెలుగోడుకు వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెలుగోడులోని ఓ మందుల దుకాణంలో పని చేస్తున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ద్వారా వెలుగోడుకు చెందిన వాహనం బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.



అశోక్ (ఫైల్)

ఎక్సైజ్ శాఖలో ఎస్‌ఐల పదోన్నతికి దేహదారుఢ్య పరీక్ష

- 16 మంది జూనియర్ అసిస్టెంట్లు ఉత్తీర్ణత

కర్నూలు: ఎక్సైజ్ శాఖ ఫోర్త్ జోన్ పరిధిలో ఎస్‌ఐ పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. సీమ జిల్లాల్లో 52 ఎస్‌ఐ పోస్టులు ఖాళీగా ఉండగా 48 పోస్టులను హెడ్ కానిస్టేబుళ్లు, క్లర్కులకు అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతి కల్పించి పోస్టింగులు కేటాయించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి 17 మందికి గాను 16 మంది హాజరయ్యారు. వారికి బరువు, ఎత్తు, ఛాతీ కొలతలను తీసుకున్నారు. వీరంతా అర్హత సాధించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, లీగల్ మెటరాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాములు, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు, ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ రామకృష్ణ, సీఐలు రాజేంద్రప్రసాద్, చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు.



దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

ఆధిపత్యం కోసమే అంతమొందించారు

- వీడిన టీడీపీ నేత సంజన్న హత్యకేసు మిస్టరీ
- ఐదుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



హత్య కేసు నిందితులను అరెస్ట్ చేసి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: టీడీపీ నాయకుడు షరీన్‌నగర్‌కు చెందిన కాశపోగు సంజన్న హత్య కేసు మిస్టరీ వీడింది. షరీన్ నగర్‌లో ఆధిపత్యం కోసమే సంజన్నను వడ్డె రామాంజనేయులు అలియాస్ అంజి కుటుంబ సభ్యులు హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వడ్డె రామాంజనేయులు, వడ్డె శివకుమార్, వడ్డె తులసి, రేవంత్, వారి అనుచరుడు మాల అశోక్‌ను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎదుట హాజరు పరిచారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో దర్యాప్తు అధికారి మహిళా పీఎస్ డీఎస్పీ కే శ్రీనివాసాచారి, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్‌తో కలిసి ఎస్పీ విక్రాంత్ పాటిల్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 9.30 గంటల ప్రాంతంలో షరీన్‌నగర్‌లో అల్లీపీరా, వీరాస్వామి భజన మందిరంలో భజన ముగించుకుని బయటకు వస్తున్న కాశపోగు సంజన్నపై అదే వీధికి చెందిన వడ్డె రామాంజనేయులు అతని కుమారులు కొంత మంది అనుచరులు కలిసి పిడిబాకులు, కత్తులు, వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేశారు. 30వ వార్డు కార్పొరేటర్ జయరాముడుకు హతుడు సంజన్న తండ్రి. జయరాముడు ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఉపకరణాలను ఉపయోగించుకొని నిందితుల కదలికలు, వారు వినియోగించిన వాహనాలు, సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించి కాదాంబరి టౌన్‌షిప్ సమీపంలోని నిర్జన ప్రదేశంలో అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. హత్యకు వాడిన వేట కొడవళ్లు, పిడిబాకు, రక్తం మరకలు ఉన్న దుస్తులు, సెల్‌ఫోన్లు, కర్రలు, హత్య సమయంలో వాడిన కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని, ప్రతి వారం స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ చెప్పారు.

శిక్షలు పడే విధంగా చర్యలు ...

విచారణ వేగవంతం చేసి నిందితులపై కఠిన శిక్షలు పడేటట్లు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. మృతుడు సంజన్న కుటుంబం, హంతకులు వడ్డె రామాంజనేయులు కుటుంబం మధ్య ఉన్న పాతకక్షలు, వార్డులో ఆధిపత్య పోరే కారణంగా దర్యాప్తులో తేలిందని వివరించారు. చాకచక్యంగా, వేగంగా కేసును ఛేదించి త్వరగా నిందితులను అరెస్ట్ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐలు మధుసూదన్‌గౌడ్, శేషయ్య, చంద్రబాబునాయుడు, శ్రీధర్, తబ్రేజ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో పేలుడు.. ముగ్గురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన బలిగేరి వీరాంజనేయులు

సి.బెళగల్: పొలంలో అడ్డుగా ఉన్న బండరాళ్లను తొలగిస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించి ముగ్గురు యువకులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సి.బెళగల్‌కు చెందిన పింజరి ఖాజా పొలంలో బండరాళ్లు అడ్డుగా ఉన్నాయి. వీటిని కంప్రెసర్‌తో పగులగొట్టడానికి గ్రామానికి చెందిన వాహన యజమాని వడ్డె రాజుతో ఒప్పందం చేసుకున్నాడు. గురువారం కంప్రెసర్ వాహన యజమాని గ్రామానికి చెందిన బలిగేరి కుంటిచేయి లక్ష్మన్న కుమారుడు బలిగేరి వీరాంజనేయులు, సురపురం మునిస్వామి కుమారుడు సురపురం శ్రీరాములు, కేశారం కుమారుడు మద్దిలేటి అనే యువకులతో కలసి పొలానికి వెళ్లారు. పొలంలోని మూడు ప్రాంతాల్లో బండరాళ్లను పేల్చేందుకు ప్రయత్నించగా రెండు మాత్రమే పేలాయి. శుక్రవారం మరోసారి వెళ్లగా మూడో బండరాయి నుంచి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. రాళ్లు ఎగిరి పడటంతో పనిలో నిమగ్నమైన ముగ్గురు యువకులు బలిగేరి వీరాంజనేయులు, సురపురం శ్రీరాములు, మద్దిలేటి గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బలిగేరి వీరాంజనేయులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పాణ్యం: పదో తరగతి పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు అబ్రహం తనిఖీ చేశారు. పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న పాఠశాలను, పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాణ్యంలోని విజయా నికేతన్, నెరవాడ మెట్ట వద్ద బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను నంద్యాల డీఈఓ జనార్దన్‌రెడ్డి తనిఖీ చేశారు. వారి వెంట ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం ఉన్నారు.



పరీక్ష కేంద్రం వద్ద రాష్ట్ర పరిశీలకులు అబ్రహం





నీళ్లు కాదు.. ఎండమావులు

రహదారులపై నీళ్లు కనిపిస్తున్నాయి. అక్కడికి వెళ్లి చూస్తే ఏమీ కనిపించవు. తీవ్ర ఉష్ణోగ్రతల ఫలితంగా ఏర్పడిన ఎండమావులని తేలుతోంది. ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 40 డిగ్రీలు దాటి పోయాయి. కర్నూలు నగరం సమీపంలోని బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎండమావులు కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు మధ్యాహ్నం వేళ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలను కాసేపు ఆపుకుని వెళ్తే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

మోక్ష మార్గానికి శుభ రాత్రులు

- రంజాన్ మాసం ఆఖరి పది రోజులు ప్రత్యేకం
- ఎతెకాఫ్, తాఖ్‌రాత్‌ల నిర్వహణలో ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): పవిత్ర రంజాన్ మాసం చివరి ఘట్టానికి చేరుకుంది. ముస్లింలు ఈ మాసమంతా మహిమతో కూడినదిగా భావిస్తారు. ఇందులో మొదటి పది రోజులు అల్లాహ్ కరుణ కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తే... రెండవ పది రోజుల్లో తమ తప్పులను క్షమించాలని ప్రార్థిస్తారు. ఇక మూడవదైన ముఖ్యమైన చివరి పదిరోజులు మొదటి రెండు విభాగాల కంటే కొంచెం భిన్నమైనవిగా భావిస్తారు. నరకం నుంచి బయట పడేయాలని అల్లాను శరణు కోరుకునేందుకు ఈ పదిరోజులను ప్రత్యేకమైనవిగా భావిస్తారు. ఈ పవిత్ర మాసంలో చివరి పదిరోజులు ఏకాగ్రతతో అల్లాను ఆరాధిస్తే ఎక్కువ ఫలితాలు లభిస్తాయని, మోక్షానికి మార్గం లభిస్తుందని భావించి ముస్లింలు మసీదులు, ఇళ్లల్లో ఎతెకాఫ్, తాఖ్‌రాత్ చేపట్టనున్నారు.

పుణ్య ఫలాల శుభరాత్రులు..

రంజాన్ మాసం చివరి పది రోజుల్లో పవిత్ర బడీరాత్ వస్తుంది. దీన్నే షబ్ ఏ ఖదర్ లేదా లైలతుల్ ఖద్ర్ అనికూడా అంటారు. ఈ పవిత్ర రాత్రి చివరి పది రోజుల్లో బేసి రాత్రుల్లో (ఈనెల 24, 25, 27, 29వ తేదీ) ఉంటుందన్న నమ్మకంతో ముస్లింలు తాఖ్‌రాత్‌గా నిర్వహిస్తారు. మరీ ముఖ్యంగా ఈనెల 27వ రోజు రాత్రే లైలతుల్ ఖద్ర్ ఉంటుందని ముస్లింల విశ్వాసం. లైలతుల్ ఖద్ర్ రాత్రి జాగరణ చేసి ప్రార్థనలు చేయడంతో వెయ్యి నెలలపాటు ఉపవాస దీక్షలు చేసినంత ఫలం లభిస్తుందని పెద్దలు పేర్కొంటున్నారు.



ఆల్‌ఫుర్కానా ఈద్గాలో తరావి ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు

ప్రజల పాపాలను క్షమించాలని కోరుతూ మహమ్మద్ ప్రవక్త ప్రార్థించారని పవిత్ర ఖురాన్ గ్రంథంలో ఉండడంతో ముస్లింలు జాగరణ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. పవిత్ర రంజాన్ మాసంలో అత్యంత ముఖ్యమైనవిగా, అధిక పుణ్యాన్ని ఇచ్చే తాఖ్ రాత్‌లు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో రాత్రుల నుంచి తెల్లవారుజామున ఫజర్ నమాజ్ వరకు పవిత్ర రంజాన్ విశిష్టత, మహాప్రవక్త గుణగణాలు, ఖురాన్ పఠనం, జికార్, తహజ్జుద్, నమాజ్‌లతో గడుపుతారు. ఇందుకోసం ఆయా మసీదులకు ఇతర ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, గురువులు, వక్తలను పిలిపించి దైవసందేశాలను భక్తులకు వివరిస్తారు. ఇందుకుగాను పట్టణంలోని పలు మసీదు కమిటీ నిర్వాహకులు ఈ పదిరోజుల పాటు వక్తలను ఆహ్వానిస్తారు.. ఈ సమయాల్లో మసీదులకు హాజరయ్యే భక్తులకు తెల్లవారుజామున సహేరి ఏర్పాట్లు చేస్తారు.

అల్లాహ్ ఇంటి ఆతిథ్యం ఎతెకాఫ్..

రంజాన్‌లో బడీరాత్ ఎంత ప్రాధాన్యత ఉంటుందో ఎతెకాఫ్‌కు కూడా అంతే ఉంటుంది. అల్లాహ్ ఇంటి (మసీదు) ఆతిథ్యం ఈ ఎతెకాఫ్ కల్పిస్తుందంటారు. 'రంజాన్ కే మహినేమె..జిస్ గావ్‌మే ఏక్‌బీ ఆద్మీ ఎతెకాఫ్ నా రహేత.. ఉస్ గావ్ పర్ లానత్ హై. ఔర్ మేరి రహ్మత్ నహీ రహేగి'. అంటే రంజాన్ మాసంలో ఒక ఊర్లో ఒక వ్యక్తి కూడా 'ఎతెకాఫ్' ఉండకపోతే.. ఆ ఊరిపై నా కరుణ, ప్రేమాభిమానాలు ఉండవు అని పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ స్పష్టం చేశారు. ఎతెకాఫ్‌ను చివరి పది రోజుల్లో పాటించాలి. ఇల్లు, కుటుంబం, వృత్తిని పక్కన పెట్టి వీలు పడిన రోజులు (కనీసం 24 గంటలు) మసీదులో గడపడమే ఎతెకాఫ్ అంటారు. అన్నింటినీ త్యాగం చేసి ఆధ్యాత్మికతతో ఉండే మనుషులపై అల్లాహ్ అత్యంత కరుణ చూపి మొరను ఆలకిస్తారని మౌల్వీలు అంటున్నారు. ప్రజాప్రతినిధుల ఇంటికెళ్లి మనం సమస్య చెప్పుకుంటాం. ఆయన అభయం ఇస్తే ధైర్యం వస్తుంది. మన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి అభయానికే ఊరట కలిగితే.. సృష్టికర్త అల్లాహ్‌కు మొరపెట్టుకుంటే లభించే అనుగ్రహానికి హద్దు ఉండదంటారు.

పది రోజులు పవిత్రమైన రోజులు



రంజాన్ మాసంలో చివరి పదిరోజులు మోక్ష మార్గానికి తరావి, ఎతెకాఫ్, తాఖ్ రాత్‌లు ఎంతో పవిత్రమైన రోజులు. ఈ రోజుల్లో కఠోర దీక్షలు రాత్రింబవళ్లు ఖురాన్, దైవ బోధనలతో నియమనిష్ఠతో ఉంటే ఎన్నో మాసాల నుంచి చేయనటువంటి పుణ్యం, మోక్షాలు లభిస్తాయన్నారు.

– అబ్దుల్‌ఖాదీర్, మౌల్వి, ఆర్టీసీ బస్టాండ్ మసీదు, నంద్యాల

80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నం

ఆత్మకూరు రూరల్: నల్లకాల్వ గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలిపై విష్ణువర్ధన్ అనే యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. నల్లకాల్వ గ్రామానికి చెందిన వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం వేళ కల్లంలో తమ మేకల మంద ఉండే కొట్టం వద్ద విశ్రాంతి తీసుకుంటోంది. ఆమె మనుమడితో పరిచయమున్న అదే గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ అనే యువకుడు తరుచూ ఆ కొట్టం వద్దకు వచ్చేవాడు. శుక్రవారం కూడా ఆ వృద్ధురాలు ఒంటరిగా ఉండడం చూసిన యువకుడు అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని కొందరు వ్యక్తులు పరుగెత్తుకు రావడంతో గమనించిన యువకుడు పారిపోయాడు. ఘటనలో వృద్ధురాలు స్వల్పంగా గాయపడింది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు గ్రామానికి చేరుకుని వృద్ధురాలిని విచారించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నందికొట్కూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టౌన్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సాయిబాబాపేటకు చెందిన ఓ వ్యాపారి పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు సిబ్బంది దాడి చేయగా బొలేరో వాహనంలో 23 ప్యాకెట్ల బియ్యాన్ని గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.